# తెలుగు ఎగిరిపోవుటకు కారణ నిర్ణయ కమిటీ

గరిమెళ్ళ సత్యనారాయణ

ఆంధ్రులకు తాత్కాలికాందోళన యందున్న అభిరుచి చిరంతన కార్యాసక్తియందు మృగ్యము. ఏదైనా ఒక ఊపువస్తే ప్రభాతభేరీలు, మహాసభలు, దీర్ఘతీర్మానాలు, మహాసంతర్పణలు, దీర్ఘప్రకటనలు నాలుగైదురోజులు ప్రజ్వరిల్లును. నాలుగు కమిటీలు, ముప్పైమంది సభ్యుల పేర్లు వార్తాపత్రికలలో ప్రకటించబడును. పత్రికలలో పేర్లుపడ్డవారందరూ, వాటిని చూచుకొని భుజములు తడవుకొని పదిరోజులదాకా విఱ్ఱవీగుతారు.

అక్కడితో ఆ గాలివాన సరి. ఎవరింట్లో వారు ఇతరకార్యాలయందు నిమగ్నులయ్యెదరు, మళ్ళీ యేదో ఆందోళనముపోటు తగులుతేకాని కళ్లు విప్పరు.

అవినాశిలింగం చెట్టిగారి ధర్మమా అంటూ చెన్నపురిప్రాంతములకు తమిళము ప్రాంతీయభాష యని యొక బెడ్డ విసరివేశారు. అది మాత్రమే అట్టిది, తక్కినభాషలు గమనార్హములు కావు అనే భావం కలగడానికి కావలసిన సన్నాహమంతా నోరు మెదపకుండానే అంతఃపూర్వమే ఆయన చేసినారు. చెన్నపట్నములోను, తత్ప్రాంతములలోను అనేకపాఠశాలలనుండి తెలుగు అప్పటికే ఉద్వాసనయైనది.

ఆయన ప్రకటన ధర్మమా అంటూ ఒక సంచలన మీ ప్రాంతములో లేచినది. గబగబ తెలుగువారల సంఖ్య, తెలుగు తీసివేసిన పాఠశాలల చరిత్రలు మొదలైన జాబితాలన్నీ పేపర్లలో ప్రకటింపబడినవి. అవినాశిలింగంగారి ప్రకటన ప్రభుత్వప్రకటన కాదని శ్రీ వెంకట్రావుగారు చాటుటతో ప్రజలకు కొంత స్థైర్యము చిక్కినది. శాసనసభ్యులందరూ తలా ఒక ఖండనను ప్రకటించారు.

తమిళ మొక్కటే ప్రాంతీయభాష కాదని ప్రభుత్వము ప్రకటించక తీరిందికాదు. లోగడ చర్యలవల్ల ఏ భాషవారికైనా యెట్టి అపచారమైనా జరిగితే, విచారించి దానిని తీర్చటానికి ప్రభుత్వమొక కమిటీని యేర్పరచక తప్పినదికాదు. ఈ కమిటీ జులై 18 మొదలు 17 వరకు వ్యక్తుల నుండి సాక్ష్యము తీసుకొంటుందట.

కమిటీలో నియమితులైన కొందరు సభ్యుల పేర్ల విషయంలోనే కొంత తగాదా పుట్టింది. ఆ తగాదా కిది సమయము కాదనీ, కార్యాచరణకు గడంగవలసినదనీ వెంకట్రావుగారిచ్చిన సమాధానం సమంజసముగా లేదనుటకు వీలులేదు.

విషయమేమో సుస్పష్టము. జరిగినదేమో అన్యాయము. ఆందోళనయేమో వేడిగా ఉన్నది. ఇట్టితరి సత్యమైన సాక్ష్యమును జాగ్రతపెట్టుట కష్టతరము కాదు. ఇప్పుడు కావలసినది పత్రికలలో స్టేటుమెంటులు ప్రకటించవలసినవారు కారు. విషయములను జాగ్రత్తపెట్టి కమిటీయెదుట నివేదించగలవారు.

ఇట్టి విషయములు పాఠశాలల అధికారులకును ఉపాధ్యాయులకును బాగుగా తెలిసినను వారు ముందుకువచ్చి నివేదించగలుగుదురనుకొనుట వెఱ్ఱితనము. ప్రతి వార్డు, పేటయందుగల అభిమానులును ఇంటింటికి పోయి గత పది సంవత్సరముల అనుభవములను విచారించి జాగ్రత్తపెట్టవలెను. వీలయినంతవరకు పాఠశాలాధికారులవద్దనుంచి సత్యమైన సమాచారము సేకరించి తమవద్ద నుంచుకొని అవసరమైతే బయటపెట్టవలెను. ఇట్టి భగీరథ ప్రయత్నం చేస్తేనే కాని ఇది జయప్రదమయ్యే సూచన లేదు.

ఇంతకూ "ముంజేతి కంకణమున కద్దమేల" యన్నట్లు ఈ విషయము ఇంత తర్జన భర్జన చేయవలసినదే కాదు. సత్యము నిరూపణమైన తరువాత, గడచినదాని కెవరినీ శిక్షింపబోయేది లేదు. శిక్షార్హములని బుజువుకాగల పనులను వారు చేసియుండక పోవచ్చును.

# ది యునైటెడ్ కమర్షియల్ బ్యాంకు లిమిటెడ్.

2, రాయల్ ఎక్స్చేంజిప్లేస్.
కలకత్తా.

•

చెల్లించిన మూలధనము :
రు. 2 కోట్లు

రిజర్వుఫండు :
రు. 40 లక్షలు

•

జి. డి. బిర్లా
చేర్మన్

బి. టి. ఠాకూర్
జనరల్ మేనేజరు

•

ఇండియా బర్మాలలోని ముఖ్యమైన అన్ని పట్టణములలోను నగరములలోను బ్రాంచీలు కలవు. ప్రపంచమంతట ఏజన్సీ ఏర్పాట్లు చేయబడినవి.


చెన్ననగర మేయొక్క భాషావాదులకు గుర్తు కాదు. అరవలు $5\frac{1}{2}$ లక్షలుంటే, తెలుగులు $4\frac{1}{2}$ లక్షలున్నారు. కొత్తగా వచ్చి చేరుతున్న వారలలో అరవల సంఖ్య కాంధ్రుల సంఖ్య తీసిపోదు. చదువుయీడు బాలబాలికల నిష్పత్తి కూడా ఆ ప్రాప్తినే ఉండవలెను. ఈ నిర్బంధోచిత ప్రారంభవిద్య రోజులలో యెవరుగాని బడికి రామనటానికి వీలులేదు.

కనుక ప్రతి పాఠశాల తరగతులలో కూడా విద్యార్థులసంఖ్య కూడా ఆ నిష్పత్తి ప్రకారమే ఉండవలెను. అట్లు లేదు. ఆంధ్రులు బడికి రాకున్నారు, వచ్చినవారు తెలుగు వద్దంటున్నారు అను వాదములో యేదో ఒక కృత్రిమమున్నట్లు దానంతట అదే స్పష్టమగుచున్నది. అవినాశిలింగం గారి వెనుకంజ, ప్రధానమంత్రి సమాధాన మార్గము ఇందు కనుగుణముగానే వున్నవి.

అయినా ఇది కమిటీల యుగం. ఒక్క కొన్ని కాల్వ కూడా ఒక కమిటీ నిర్ణయించకపోతే, ప్రభుత్వం ఆచరించదు. అందుకోసం ఇట్టి కమిటీల నేర్పరచుట వాజబియైనది.

ఈ "ప్రజాయుగం" లో సర్వమూ కమిటీల నిర్ణయాలమీద ఆధారపడుచున్నది. కొన్ని కమిటీలను కేవలం ప్రజల కన్నుతుడుపునకు మాత్రమే యేర్పాటుచేసి, తమ కనుకూలముగా నిర్ణయములే వాటివల్ల జరుగునట్లు చూడడం అనేక సంస్థలకు పరిపాటి అయినది.

ఈ కమిటీ అట్టిది కాదనియే అనుకొందము. ఏ కమిటీకైనా సాధారణముగా గతమున కనుకూలమైన తీర్పు వ్రాయడమే పరిపాటియైనది. అందు కనుకూలంగా సాక్ష్యం వస్తేను, ప్రతికూలంగా తీవ్రమైన సాక్ష్యం రాకుంటేను వారిని నిందించ ప్రయోజనంలేదు.

అయినా కమిటీవారి తత్వమునుబట్టియే వారికి చేకూరే సాక్ష్యంకూడా నడుస్తుంది. కమిటీవారు కేవలం తమకువచ్చే సాక్ష్యంపట్ల నిష్పాక్షికముగా ఉంటామంటే చాలదు. సత్యమును తమకడకు రాబట్టుకొనగల కృషిసంతటినీ సర్వశక్తులా చేయాలి. అదియే నిజమైన కమిటీ లక్షణము. ఈ మార్గమున ఈ కమిటీ యెంతవరకు వర్ధిల్లగలదో, దాని కీర్తి కూడ అంతవరకే వర్ధిల్లుతుంది. లేకుంటే లక్షా తొంభైవేల కమిటీలవలె అది కూడా విస్మృతమగును.